క్లుప్తంగా

'వేతనాలు ఇప్పించండి'

నర్మెట: ఆరునెలలుగా తమకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెల్దండ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఎమెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణ భూమిపూజకు మంగళవారం హాజరైన ఆయనను కలిసిన సిబ్బంది తమసమస్యలను విన్నవించగా సానుకూలంగా స్పందించారు. వేతనాలు చెల్లించిన అనంతరమే ఇతర పనులకు నిధులను కేటాయించాలని ఎంపీడీఓ అరవింద్ చౌదరి, ప్రత్యేక అధికారి సుకన్యలకు సూచించారు.

ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ

చిల్పూరు: మండలంలో నిర్వహించిన ఇంటింటి సమగ్ర సర్వే డేటా ఎంట్రీని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరస్వతి మంగళవారం పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ స్వయంగా కంప్యూటర్‌లో డేటాను ఎంట్రీ చేశారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ మధుసూదన్‌తో పాటు తాను 45 మంది ఆపరేటర్లతో డేటా ఎంట్రీని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సమాజాభివృద్ధికి సామాజిక సేవ

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా చేసే సామాజిక సేవలతోనూ సమాజాభివృద్ధి చెందుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. మంగళవారం బీఆర్ఎస్ యువజన నాయకుడు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ స్వగృహానికి వచ్చిన వీరభద్రంను దంపతులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నేటి రాజకీయ స్థితిగతులు, సామాజిక ఉద్యమాల నేపథ్యాలపై చర్చించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నర్మెట: బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చి విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన హన్మంతాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుమ్మడివల్లి చెందిన ఈరటి బాలకృష్ణ రాజేశ్వరి దంపతులు జీవనోపాధికోసం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. కాగా, తన భార్య ముగ్గురు పిల్లలతో కలిసి మంగళవారం బంధువుల గృహప్రవేశానికి హన్మంతాపూర్ వచ్చారు. ఈక్రమంలో కూతురు బాత్‌రూంలో మలవిసర్జనకు వెళ్లగా ఆమెను తీసుకువస్తున్న క్రమంలో వాటర్ హీటర్ ఉన్న బకెట్‌లో రాజేశ్వరి చేయి పడటంతో విద్యుత్ షాక్ గురై మృతిచెందింది. మృతురాలి భర్త బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ హిదాయత్ అలి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

దేవరుప్పుల: ప్రమాదవశాత్తు గాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండలంలోని కడవెండికి చెందిన భాషిపాక యాదయ్య (57) సోమవారం సాయంత్రం బంగ్లా ఎక్కి సొరకాయ తెంపే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడగా ఇనుమ చువ్వలు తలలో దిగి తీవ్రగాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం యాదయ్యను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. యాదయ్య సోదరుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా చేసినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి..

జఫర్‌గఢ్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన కొంతం లక్ష్మీనారాయణ (46) ఈ నెల 8వ తేదీన రాత్రి పొలం వద్దకు బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ నిమ్స్ అస్పత్రిలో చేర్చారు. కొద్ది రోజులుగా చికిత్స పొందుతూ లక్ష్మీనారాయణ మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవపంచానమ నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బస్సులో నుంచి దూకిన మహిళకు తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: తాను దిగే స్టేజీ దాటిపోతుందని కదులుతున్న బస్సులో నుంచి దూకిన మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం మండలంలోని వడిచర్ల సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో జీడికల్‌కు చెందిన పరకాల సునీత తలకు బలమైన గాయాలయ్యాయి. సునీత చిన్నమడూరులోని తన చెల్లెలి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో నేలపోగుల స్టేజీ వద్ద జనగామ బస్సు ఎక్కింది. తల్లిగారి ఊరైన కొత్తపల్లి స్టేజీ వద్ద దిగాల్సి ఉండగా స్టేజీ దాటిపోతుందనే ఆందోళనతో డ్రైవర్, కండక్టర్‌కు చెప్పకుండానే కదులుతున్న బస్సులో నుంచి దూకింది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ వచ్చేందుకు సమయం పడుతుందని, తన వాహనంలోనే జనగామ ఏరియా ఆస్పతికి తరలించారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు సమాచారం.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్

- లూజ్ వైర్లు లేకుండా చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని చెక్‌డ్యామ్ వంతెన మధ్యలో నుంచి గృహ, వ్యవసాయ అవసరాలకు కోసం ఉన్న మెయిన్‌లైన్ విద్యుత్ వైర్లు లూజ్ కావడంతో ప్రమాదకరంగా మారాయి. నీటి ప్రవాహంతో వాగు మధ్యలో ఇసుక మేటలు వేసి లూజ్‌వైర్లు అందేలా ఉన్నాయి. సాధారణ అవసరాలతోపాటు అంత్యక్రియల కోసం వెళ్లే జనం పొరపాటున చెయ్యెత్తితే గాలిలో ప్రాణాలు కలిసేలా ఉన్నాయి. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన లూజ్‌వైర్లు లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను చూపిస్తున్న గ్రామస్తులు

జీపీ భవనానికి స్థలం అందజేత

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో గ్రామ పంచాయతీ భవనానికి ప్రభుత్వ స్థలం లేక పోవడంతో అదే గ్రామానికి చెందిన ఇమ్మడి రాజిరెడ్డి, చెప్యాల నరసింహారెడ్డిలు ఉచితంగా తమ సొంత స్థలాలు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. గ్రామ కూడలిలో దాదాపు రూ 3.లక్షల విలువైన 300 గజాలు గ్రామ పంచాయతీకి విరాళంగా ఇచ్చారు. మంగళవారం వారు స్థలానికి సంబంధించిన పత్రాలను గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి విరాళం ఇచ్చిన రాజిరెడ్డి, నర్సింహారెడ్డిలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు అభినందించారు. మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, మాజీ సర్పంచ్ బొల్లపల్లి మంజుల, గ్రామ పెద్దలు బొల్లపల్లి కుమారస్వామి, బాల్నె పరుశరాములు, మేకల మురళి, మంకెన అన్నపురెడ్డి, బొల్లపల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పెద్దలకు స్థల పత్రాలు అందజేస్తున్న దాతలు



కొడకండ్ల: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



పాలకుర్తి: నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



పాలకుర్తి: ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కాగా, పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అయా కార్యక్రమాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



జనగామ రూరల్: ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం జయప్రకాశ్



జనగామ: ఇండియన్ కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



జనగామ రూరల్: అగాపే గుడ్‌షపర్డ్ స్కూల్‌లో మాక్ పోలింగ్‌లో విద్యార్థులు



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

- సీడీపీఓ ఫ్లోరెన్స్

రఘునాథపల్లి: అంగన్‌వాడీలో చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీడీపీఓ ఫ్లోరెన్స్ టీచర్లకు సూచించారు. మంగళవారం మండలంలోని కోమల్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ప్రీస్కూల్ కిట్‌ను పరిశీలించారు. పిల్లల్లో వయస్సుకు తగిన బరువు గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె అన్నారు.



సూచనలు ఇస్తున్న సీడీపీఓ ఫ్లోరెన్స్

అనుమతిలేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలి

జనగామ రూరల్: పట్టణంలో ఐఎస్ఐ అనుమతి లేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధికారులను డిమాండ్ చేశారు. పట్టణ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ అదుపు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. బాలమణి, సౌందర్య, అబ్రహం లింకన్, రాజు, సుధాకర్, బాలస్వామి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యేలు కడియం, యశస్వినిరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల/పాలకుర్తిటౌన్: గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్వినిరెడి అన్నారు. మంగళవారం పలు మండలాల్లో జరిగిన అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపనలు చేశారు. పాలకుర్తి మండలంలోని రామన్నగూడెం, రంగాపురం, నర్సింగాపురం గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా పలు అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపాలన్నదే ధ్యేయమన్నారు. డీఆర్‌డీఓ వసంత, ఎంపీడీఓ నాగేశేషాద్రిసూరి, ఏపీఓ కుమారస్వామి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పాల్గొన్నారు. అలాగే దేవరుప్పుల మండలంలోని లక్ష్మణ్‌తండాలో గ్రామ పంచాయతీ భవనం, దేవరుప్పుల చెర్లబడిలో అంగన్‌వాడీ భవనం, కామారెడ్డి గూడెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. టీపీసీసీ సభ్యులు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణనాయక్,డీఆర్‌డిఓ పీడీ వసంత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్ల అండాలు శ్రీరాములు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాగా, పాలకుర్తి మండలంలోని వల్మిడిలో అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ, మల్లంపల్లి గ్రామ పంచాయతీ భవనానికి, బమ్మెర గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ లావుడ్యా మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజకీయాలు అవసరం లేదు

రఘునాథపల్లి/లింగాలఘణపురం: ఎన్నికల సమయంలోనే రాజకీయాలని.. అభివృద్ధిలో రాజకీయాలు అవసరం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని కోమల్లలో రూ 52 లక్షల విలువైన గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధికారులు, నాయకులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. ఈ సందర్భంగా జీపీ భవన స్థల దాత నర్సింహారెడ్డిని సత్కరించారు. అంతకు ముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపిరాం, డీపీఓ స్వరూప, మండల ప్రత్యేకాధికారి రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ మోసిన్ ముస్తాబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, మాజీ సర్పంచ్ బొల్లపల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు. అలాగే లింగాలఘణపురం మండలంలోని వనపర్తిలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.52 లక్షలతో చేపట్టే జీపీ, అంగన్‌వాడీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీహరి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. వనపర్తి గ్రామంలో మోడల్ గ్రామ పంచాయితీ నిర్మాణానికి రూ.20 లక్షలకు అదనంగా మరో రూ.20 లక్షలు, సీసీ రోడ్లకు రూ.20 లక్షలు, 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డీపీఓ స్వరూప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ ఆండాలు, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్, ఏఈ శ్రీనివాసు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: కోమల్లలో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కొడకండ్ల: అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పౌష్టికాహారాన్ని అందించాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట/తరిగొప్పుల/బచ్చన్నపేట/జనగామ రూరల్: అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వెల్దండలో ఈజీఎస్ నిధులు రూ. 12 లక్షలతో నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేసి మాట్లాడుతూ తహసీల్దార్ రామానుజాచార్యులు, ఎంపీడీఓ అరవింద్ చౌదరి, పీఆర్ ఏఈ ప్రదీప్, ఎంఈఓ ఐలయ్య, ఏపీఓ రమాదేవి, ప్రత్యేక అధికారి సుకన్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునితాదేవి, ఎమ్మార్ఐ సాయిబాబ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగారావు, మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే తరిగొప్పుల మండలకేంద్రం కమ్మరిపేటలో ఉపాధి హామీ నిధులతో నిర్మించబోయే అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి ఎమ్మెల్యే పల్లా భూమి పూజ చేశారు. మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరచారి, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంఈఓ నెల్లుట్ల జానకి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు. బచ్చన్నపేట మండలంలోని బోనకొల్లూర్‌లో రూ.5లక్షల ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతతో కలిసి పల్లా భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిక్కుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. జనగామ మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టనున్న నూతన పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే పల్లా భూమిపూజ చేశారు. అలాగే ఎల్లంలలో రూ.5లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. బాల్దె సిద్దిలింగం, బొల్లం శారద, ఎడ్ల శ్రీనివాస్, ప్రమోద్‌రెడ్డి కొమ్మురాజు, ఏఈ శ్రీనివాస్, ఏపీఓ భిక్షపతి పాల్గొన్నారు.



నర్మెట: మిలటరీ దుస్తుల్లోని చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జనసభ

పాలకుర్తి టౌన్/జఫర్‌గఢ్: రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సమరశీలపోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా అన్నారు. మంగళవారం పాలకుర్తి, జఫర్‌గఢ్ మండల కేంద్రాల్లో డిసెంబర్ 6న వరంగల్ నగరంలో నిర్వహించే జనసభ విజయవతం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, వ్యక్తిత్వవికాసాన్ని పెంపొందించుకోవాలని సీఐ జి.వేణు అన్నారు. శివునిపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎస్సై వినయ్, ఏఎస్ఐ రాజమౌళి, ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

చిల్పూరు: తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండంలోని కొండాపూర్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వైద్యం వాణిరాణిని నిర్వాహకులు మంగళవారం ఘన సన్మానించారు. హైదరాబాదులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాలలో విద్యాభివృద్ధికి పాటు పడిన వాణిరాణికి జ్యూరిస్ట్ సేవా రత్న అవార్డును అందజేయడంతో పాటు ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, దయానంద్‌లు సన్మానించారు.

నియామకం

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన చిల్పూరు ఆలయ ధర్మకర్త వేముల వెంకటేశ్వర్లు పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మంగళవారం నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

చేసిన అభివృద్ధిని వివరించండి!

పాలకుర్తి: నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. మంగళవారం వారు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లయ్య, బొబ్బాల అశోక్ రెడ్డి, ఎండీ మదార్, కారుపోతుల వేణు, పాము శ్రీనివాస్, గణేష్ న్నారు.

టీఎన్జీఓస్ బ్లాక్ కమిటీ ఎన్నిక

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ పాలకుర్తి బ్లాక్ నూతన కమిటీ అధ్యక్షుడిగా బక్క మహేష్‌యాదవ్ (తీగారం జీపీ కార్యదర్శి) ఎన్నికైనట్లు ఆ విభాగం జిల్లా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజీ షరీఫ్, పండేలా శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం టీఎన్జీఓస్ జిల్లా కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల బ్లాక్ కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి వెంకటయ్య(పాలకుర్తి దేవస్థానం సూపరింటెండెంట్), సావిత్రి(ఐసీడీపీ సూపర్‌వైజర్), సహాయ కార్యదర్శిగా బి.లత, ప్రధాన కార్యదర్శిగా కాసర్ల రాజు(ఆర్ఐ, దేవరుప్పుల), కోశాధికారిగా యుగందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ముత్తినేని వెంకటేష్ (ఈఏఓ),పబ్లిసిటీ కార్యదర్శిగా శివప్రసాద్, ఈజీ మెంబర్‌గా కోమలత, అమర్‌నాథ్ ఎన్నికయ్యారు.

గోపా మండల అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్

పాలకుర్తి టౌన్: గోపా(గౌడ ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్స్) పాలకుర్తి మండల అధ్యక్షుడిగా కమ్మగాని రమేష్‌గౌడ్ ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులుగౌడ్ మంగళవారం తెలిపారు. గోపా మండల గౌరవ అధ్యక్షుడిగా వల్లకొండ లక్ష్మీనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండి యాకన్నగౌడ్, సహాయ కార్యదర్శి మూల రాఘవులుగౌడ్, కోశాధికారిగా ముంజ రాములుగౌడ్, ఉపాధ్యక్షుడిగా మెరుగు మధుసూదన్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా మూల వెంకటేశ్వర్లు, బండి సోమన్న, గూడ దామోదర్, కారుపోతులు శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపెల్లి ఉప్పలయ్య గౌడ్, గిరగాని సమ్మయ్య ఎన్నికయ్యారు.

డ్రాగన్ ఫ్రూట్ తోట పనులు ప్రారంభం

చిల్పూరు: మార్కెట్‌లో ఎక్కువగా వినియోగంలో

సంక్షిప్త సమాచారం

ఉన్న వాటిని పండిస్తూ అధిక లాభాలు పొందాలని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్టలో ఈజీఎస్ పనుల్లో భాగంగా మంగళవారం కుంచాల బుచ్చయ్యకు డ్రాగన్ ఫ్రూట్ ప్లాంటేషన్ సబ్సిడీ కింద రూ. 2,63,208 మంజూరు కాగా మొక్కలను నాటి తోట పనులను శ్రీధర్‌రావు ప్రారంభించారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఉపాధిహామీ ఏపీవో మోహన్‌రావు, టీఏ చేరాలు, ఎఫ్ఏ కుంచాల రాజు, దార అశోక్‌పాల్, సతీష్, మధు, యేసోబు, కృష్ణ,మనోజ్ పాల్గొన్నారు.

'రాజ్యాంగంపై గౌరవం ఉంటే కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి'



స్టేషన్‌ఘన్‌పూర్: నీతి, నిజాయితీ అని గొప్పలు చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాజ్యాంగంపై గౌరవం ఉంటే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాజయ్య ముందుగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల ఓటరు లిస్టు తుది జాబితా విడుదల చేశామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే సవరిస్తామని ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో గ్రామ పంచాయతీ ఎన్నికలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పకంజ నాయకులు పాల్గొన్నారు.

వలలో చిక్కుకున్న కొండ చిలువ

చిల్పూరు: మండల కేంద్రంలోని బ్రెంకల చెరువులో మంగళవారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు జంగిటి కుమార్ ఆధ్వర్యంలో చాపలు పట్టేందుకు వలలు వేశారు. సాయంత్రం సమయంలో వలలను బయటకు తీయగా అందులో భారీ కొండ చిలువ మృతి చెంది కనిపించింది. ఉదయం వలలో చిక్కుకోవడం వలన మృతి చెంది ఉండవచ్చని కుమార్ తెలిపాడు.

సభకు తరలిన దివ్యాంగులు

జఫర్‌గఢ్: దివ్యాంగుల పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో తలపెట్టిన సభకు మండలానికి చెందిన దివ్యాంగులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు తాటికాయల హరికృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైన ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు.

పరామర్శ

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన భాషిపాక యాదయ్య మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ మండల నాయకులు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

29 నుంచి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు

పాలకుర్తి టౌన్: ఈ నెల 29,30న పాలకుర్తిలో సీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోనే కుమారస్వామి మంగళవారం తెలిపారు. రవి, గుతులోత్ అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

పుష్పయాగంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో పడమర కొండ దిగువన ఉన్న లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన స్వామివారి బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో సోమవారం రాత్రి ఘనంగా ముగిసాయి. కార్యక్రమంలో ఆలయ పూజారులు వెంకటాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా దివిటి అంజనీదేవి రచించిన వేల్పుగొండ లక్ష్మీనరసింహ శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని వేదపండితుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

డిసెంబర్ 21 నుంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 21, 22 తేదీల్లో నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాన్ని పాఠశాల వేదికగా మంగళవారం నిర్వహించారు. పాఠశాలలో 1973 సంవత్సరంలో 10వ తరగతి ప్రారంభమై 2024 సంవత్సరానికి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు నిర్ణయించారు.

తిరుమలనాథస్వామి పవిత్రోత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని శ్రీతిరుమలనాథస్వామి దేవస్థానంలో రెండు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేషపూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కలకోట రామానుజచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక మాస మంగళవారం భక్త జనసందోహం నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

నగర సంకీర్తన

నర్మెట: హిందూత్వమే భారతీయ జీవన విధానమని జనజాగరణ సమితి సభ్యులు ధరావత్ రాజు, బిజ్జ సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన హిందూ చైతన్య రథయాత్ర నగర సంకీర్తనలతో హరేరామ హరేకృష్ణ నామస్మరణతో మండల కేంద్రం మారుమోగింది.